సాక్షి
మహబూబాబాద్

గురువారం । 27 । జూలై । 2023



బ్రాహ్మణులకు ప్రత్యేక స్థానం

రాష్ట్రంలో బ్రాహ్మణ పరిషత్ స్థాపనతో బ్రాహ్మణ కులస్తులకు సముచిత స్థానం లభించిందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. - 8లో▸



రూ.10లక్షల గంజాయి పట్టివేత

కాజీపేటలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.10లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
25.2^0 / 24.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం చిరుజల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం తర్వాత పలుచోట్ల భారీ నుంచ అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి



గూడూరు: వర్షాల ఉధృతి వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ డేవిడ్ అన్నారు. మండల కేంద్రానికి సమీప నెక్కొండ, కేసముద్రం మండలాలకు వెళ్లే రహదారిలోని పాకాల వాగు ఉధృతిని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పాత పెంకుటిళ్లు, కొట్టాలు, శిథిలావస్థ గోడలు వర్షాల వల్ల కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. యజమానులు వాటిలో ఉండొద్దని సూచించారు. ఎక్కడ ఎలాంటి ఘటన జరిగినా అందుబాటులో ఉండి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు సూచించారు. అనంతరం తహసీల్దార్ బొల్లెపల్లి, దామరవంచ, అయోధ్యపురం గ్రామాల్లో పాతపెంకుటిళ్ల యజమానులకు తగు జాగ్రత్తలు తెలిపి, వర్షాలు తగ్గాక వాటిని తొలగించాలని నోటీసులు అందజేశారు.

వట్టివాగు సందర్శన

కేసముద్రం: మండలంలోని అర్పనపల్లి గ్రామంలోని బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వట్టివాగును అదనపు కలెక్టర్ డేవిడ్ బుధవారం సందర్శించి, వాగు ఉధృతిని పరిశీలించారు. వాగు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేసి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివుడు, సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా భారీ వర్షాలతో మండల కేంద్రం అంబేడ్కర్ సెంటర్‌లోని సంతోష్ నగర్‌కాలనీలో ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో కాలనీవాసులు బయటకు రాలేని పరిస్థితి ఉంది.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి



కొత్తగూడ: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సాయికుమార్ డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాత యాత్ర బుధవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని కోరారు. సంక్షేమ వసతి గృహాలు సమస్యలతో నిండిపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సింహాద్రి, సామ్య, మహేశ్వరి, శ్రావణి, రాజేష్, హరిచంద్, అరవింద్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

30న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న ఎన్టీఆర్ స్టేడియంలో 12ఏళ్ల పైబడిన క్రీడాకారులకు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమవుతాయని జిల్లా కార్యదర్శి నాగమణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాస్థాయి జావెలిన్‌త్రో, 100, 400 మీటర్ల పరుగు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారిని ఆగస్టు 7న హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో జరిగే రాష్ట్రస్థాయి రెండో నేషన్ ఏఎఫ్‌ఐ జావెలిన్ డే స్పోర్ట్స్ మీట్‌కు ఎంపిక చేయనున్నట్లు ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు 9052670288 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రైతులకు సలహాలు ఇవ్వాలి



పెద్దవంగర: పంటల సాగులో రైతులకు ఏఈఓలు సలహాలు ఇవ్వాలని డీఏఓ ఛత్రునాయక్ సూచించారు. బుధవారం మండలంలోని గంట్లకుంట గ్రామంలో ఏఈఓలు చేపడుతున్న పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం స్థానిక రైతులతో మాట్లాడారు. అర్హత కలిగిన రైతులందరూ రైతు బీమాకు విధిగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆగస్టులోపు తమ దరఖాస్తులను వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని చెప్పారు. రైతులు పంటలను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఎల్లప్పుడు ఏఈఓలు అందుబాటులో ఉంటారని, పంటలకు చీడపీడలు సోకితే సలహాలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ కుమార్‌యాదవ్, ఏఈఓ కాటమ రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వదలని వాన..

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

- వరద ప్రవాహం తగ్గినా.. కోలుకోని గ్రామాలు
- నీట మునిగిన పత్తి, మొక్కజొన్న
- ప్రమాదాలు జరగకుండా అప్రమత్తం



గార్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల ఏరు

సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో వాగులు, వంకల్లో ప్రవాహం కొనసాగుతోంది. లోతట్టు గ్రామాలు నీటిలోనే ఉండిపోయాయి. ఇంకా పలు గ్రామాలకు రాకపోకలు మెరుగు పడలేదు. కాగా వర్షాల నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచనలు చేస్తున్నారు. రాష్ట్ర మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్‌తో పాటు కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్, అధికారుల బృందం జిల్లాలో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు.

పొంగుతున్న వాగులు

జిల్లాలో బుధవారం కొన్ని చోట్ల భారీ, కొన్నిచోట్ల మోస్తరు వర్షం కురిసింది. గంగారం మండలంలో అత్యధికంగా 6.4సెంటిమీటర్లు, మరిపెడ మండలంలో 6.1 సెంటిమీటర్ల వర్షం కురిసింది. అదే విధంగా అత్యల్పంగా కొత్తగూడలో రెండు సెంటిమీటర్లు, తొర్రూరులో మూడు సెంటిమీటర్ల వర్షం నమోదైంది. ఆకేరు, మున్నేరు, వట్టివాగు, ఈదుల వాగు, కత్తెర్ల వాగు, పాకాల వాగు, మున్నేరు వాగులు పొంగుతున్నాయి.

అలాగే జిల్లాలో 1,590 చెరువులకు గాను 905చెరువులు మత్తళ్లు దూకుతున్నాయి. మరో 432 చెరువులు అలుగుకు దగ్గరగా ఉన్నాయని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కాగా జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతుండంతో 26ప్రాంతాల్లో రహదారులపై వాహనాల రాకపోకలను నిలిపివేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో నిఘాను పటిష్టం చేశారు.





ఉధృతంగా అలుగుపోస్తున్న బయ్యారం పెద్ద చెరువు, మొండ్రాయిగూడెం వాగు వద్ద పోలీసు పహారా



మరిపెడ శివారులో నీటమునిగిన వరిపంట

జిల్లాలో చెరువుల పరిస్థితి

మొత్తం చెరువులు	1,590
అలుగులు పోస్తున్నవి	905
75నుంచి 100శాతం నిండినవి	432
50 నుంచి 75శాతం నిండినవి	115
25 నుంచి 50శాతం నిండినవి	123
25శాతం వరకు నిండినవి	15

పత్తి, మొక్కజొన్న చేన్లలో నీరు..

వరుసగా కురుస్తున్న వర్షాలతో పత్తి, మొక్కజొన్న చేన్లలో వరదనీరు నిలిచింది. వరిపొలాలు నీట మునిగాయి. ఇలాగే వర్షం కురిస్తే పత్తి, మొక్కజొన్న మొక్కలు ఎర్రబడి చనిపోయే అవకాశం ఉంది. కాగా ప్రస్తుతం చేన్ల నుంచి నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, వర్షం తగ్గగానే పంట చేన్లలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.

పరిశీలన..

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, చెరువులను మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్ పరిశీలించారు. నీటి ప్రవాహాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని కంఠాయపాలెం, గుర్తూరు, తొర్రూరు చెరువులు అలుగులు పోస్తుండడంతో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి బుధవారం సందర్శించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆయా చెరువుల వద్ద మంత్రి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కొనేలా అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం కలగకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నందున ఎవరూ చేపలు పట్టేందుకు, ఈతకు వెళ్లవద్దన్నారు. విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సీతారాములు, ఆర్‌బీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు కిషోర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు మేరుగు మాధవి, పల్లె దేవమ్మ, నాయకులు బాలకృష్ణ, వెంకన్న, కుమార్, మల్లయ్య, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



కంఠాయపాలెం చెరువులో పూజలు చేస్తున్న మంత్రి దయాకర్‌రావు

ప్రవాహాల వద్దకు వెళ్లొద్దు

నర్సింహులపేట: ప్రజలు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెరువుల మత్తళ్ల వద్దకు వెళ్లొద్దని కలెక్టర్ శశాంక అన్నారు. మండలంలోని కౌసల్యాదేవిపల్లి శివారులోని ఆకేరు వాగు ఉధృతిని ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ప్రజలు నీటి ప్రవాహాల వద్దకు వెళ్లొద్దని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని, రైతులు వ్యవసాయ పనులు నిలిపివేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, ఎంపీపీ టేకుల సుశీల, తహసీల్దార్ జి.వివేక్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఎస్సై సతీష్, స్థానికులు, సిబ్బంది పాల్గొన్నారు.

మరింత అప్రమత్తత అవసరం..

మహబూబాబాద్: భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని, ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శశాంక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారుల సలహాలు, సూచనలను ప్రజలు పాటించాలన్నారు. లోతట్టు ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలన్నారు. ఆరు నెలలు దాటిన గర్భిణులను సమీప ఆస్పత్రిలో అడ్మిట్ చేయాలన్నారు. అత్యవసరమైతే కంట్రోల్‌రూంకు కాల్ చేయాలన్నారు. 24 గంటలు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.



ఆకేరు వాగు ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

గుండె'జల్లు'..
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనజీవనం అస్తవ్యస్తం

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి
- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్ రావు
- 8లో▸

- మరిన్ని ఫొటోలు 9లో▸

రైతులు వ్యవసాయ పనులకు వెళ్లొద్దు

- మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్: అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని మున్నేరువాగు ఉధృతిని ఆమె పరిశీలించి మాట్లాడారు. భారీ వర్షాలతో వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయని, చేపలు పట్టడానికి అనుమతి ఇవ్వొద్దని, రైతులు వ్యవసాయ పనులకు వెళ్లొద్దన్నారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దన్నారు. మున్నేరు, ఆకేరు, పాలేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని,లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. సీఎం కేసీఆర్ చెరువుల మరమ్మతులు, చెక్ డ్యాంల నిర్మాణం చేపట్టడం వల్లే పెద్ద సమస్యలు లేవన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, బీఆర్‌ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మున్నేరు వాగు వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

వరద ప్రభావిత ప్రాంతాలపై దృష్టిపెట్టాలి

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి, వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సత్యవతిరాథోడ్ ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ఆమె ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పక్కాగా వాస్తవ పరిస్థితిని అంచనా వేయాలన్నారు. భారీ వర్షాల వల్ల ఎలాంటి పరిస్థితి ఉత్పన్నమైనా సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్నిశాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. అధికారులు సెలవులు పెట్టకుండా అందుబాటులో ఉండాలన్నారు. దెబ్బతిన్న రోడ్లను సత్వరమే మరమ్మతులు చేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందుస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఆకేరు సందర్శన

నెల్లికుదురు: మండలంలోని కాచికల్, మదుపల్లి గ్రామాల మధ్య ప్రవహిస్తున్న ఆకేరు వాగు ప్రవాహాన్ని బుధవారం మంత్రి సత్యవతిరాథోడ్, కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్రపవార్ పరిశీలించారు. వారివెంట అధికారులు వెంకటేశ్వర్లు, సమ్మిరెడ్డి, నారాయణ, తహసీల్దార్ యోగేశ్వరరావు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పుస్తకాలేవి?

ఇంటర్ విద్యార్థులకు అందని పాఠ్యపుస్తకాలు

- రెండు నెలలుగా ఎదురుచూపులు
- పుస్తకాలు లేక ఇక్కట్లు
- ముందుకు సాగని చదువులు

తొర్రూరు: జిల్లాలో ఇంటర్ కళాశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా..నేటికీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందలేదు. దీంతో చదువులు ఎలా సాగుతాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ముద్రణ,సరఫరాలో సమస్యలు నెలకొన్నాయని అధికారులు చెబుతున్నారు. పుస్తకాలు లేకుండా బోధించడం కష్టంగా మారుతోందని అధ్యాపకులు వాపోతున్నారు.

10 కళాశాలలు..

జిల్లా వ్యాప్తంగా 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో 2వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. పేద విద్యార్థులు కావడంతో ప్రభుత్వం అందించే ఉపకారవేతనాలు, ఉచిత పుస్తకాలపైనే ఆధారపడి చదువుకుంటున్నారు. జూన్ 1వ తేదీ నుంచి కళాశాలలు ప్రారంభం కాగా.. నేటి వరకు పుస్తకాలు రాలేదు. రోజు కళాశాలకు వచ్చి అధ్యాపకులు చెప్పే పాఠ్యాంశాలు విని వెళ్తున్నారు. పుస్తకాలు లేకపోవడంతో ఇంటి వద్ద చదువుకోవడానికి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. త్వరగా పుస్తకాలు పంపిణీ చేస్తే చాలా ప్రయోజనం ఉంటుందని కోరుతున్నారు.

సీనియర్లవి సర్దుబాటు...

కొత్త పుస్తకాలు రాకపోవడంతో ప్రథమ సంవత్సర విద్యార్థులు పరిచయం ఉన్న సీనియర్ల వద్ద పాత పుస్తకాలు తీసుకొని చదువుతున్నారు. కళాశాల నుంచి వెళ్లిన విద్యార్థుల వద్ద గత సంవత్సర పుస్తకాలను ఇప్పించేలా కళాశాలల అధ్యాపకులు చొరవ తీసుకుంటున్నారు. అయితే అకాడమీ పుస్తకాలు ఇచ్చేందుకు చాలామంది విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. బయట మార్కెట్‌లో సైతం పూర్తిస్థాయిలో పుస్తకాలు అందుబాటులో లేకపోవడంతో చేసేదేమి లేక విద్యార్థులు కేవలం అధ్యాపకులు చెప్పే పాఠాలు విని వెళ్తున్నారు.


సరఫరాలో ఇబ్బందులు..

గత విద్యా సంవత్సరం నూతన పుస్తకాలు ముద్రణ అయిన వెంటనే నేరుగా ఆయా కళాశాలలకు సరఫరా చేశారు. ఈ సారి అలాగే చేయాలని భావించినా సరఫరా, కొరియర్, పార్శిల్ చేయడంలో సమస్యలు తలెత్తుతున్నాయని ఇటీవల అధికారులతో నిర్వహించిన సమావేశంలో విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన ఆమె ఇప్పటికే సరఫరాలో జాప్యం జరిగిందని వెంటనే జిల్లా నోడల్ అధికారి కార్యాలయానికి సరఫరా చేయాలని ఆదేశించారు. దీంతో సంబంధిత అధికారులు జిల్లా వరకు పంపిణీ చేసే ప్రక్రియ ప్రారంభించినట్లు సమాచారం.



తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠాలు వింటున్న విద్యార్థులు(ఫైల్)

వర్షాలతో పంపిణీ ఆలస్యం



ఇటీవలే జిల్లాకు పుస్తకాలు వచ్చాయి. కురుస్తున్న వర్షాలతో సెలవులు రావడంతో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడంలో ఆలస్యమైంది. జిల్లాల వారీగా పుస్తకాలను సరఫరా చేసే ప్రక్రియ ప్రారంభమైంది. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రెండు, మూడు రోజుల్లో అన్ని కళాశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తాం. ఈ ఏడాది ఉత్తీర్ణత పెంపునకు కృషి చేస్తాం.

– సమ్మెట సత్యనారాయణ, జిల్లా ఇంటర్ విద్యాధికారి

వర్షాలకు రోడ్లు ధ్వంసం

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో చాలా వరకు రోడ్లు ధ్వంసమయ్యాయి. ఆర్‌అండ్‌బీ రోడ్లు 846 కిలోమీటర్లు ఉండగా.. వర్షాలకు 35కిలోమీటర్ల వరకు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. అలాగే మానుకోట మున్సిపాలిటీలో రోడ్లు 120 కిలోమీటర్లు ఉండగా.. కొంతవరకు దెబ్బతిన్నాయి. మిషన్ భగీరథ పనుల వల్ల గుంతలు ఏర్పడగా తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయితే వర్షాలతో ఆయా ప్రాంతాల్లో రోడ్లు కొట్టుకుపోయి గుంతలు పడ్డాయి. అలాగే ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో, ఈదులపూసపల్లి రోడ్డులో, పత్తిపాక రోడ్డులో, బంధం చెరువు రోడ్డులో, జిల్లా ఆస్పత్రి ఎదుట, మూడుకొట్ల సెంటర్‌లో రోడ్లు ధ్వంసమయ్యాయి.

–మహబూబాబాద్/సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్



జిల్లా కేంద్రంలోని మూడుకోట్ల సెంటర్‌లో రోడ్డుపై ఏర్పడిన భారీ గుంత



జిల్లా ఆస్పత్రి ఎదుట..



ఆర్టీసీ బస్టాండ్ ఎదుట..

ఉపకరణాల పంపిణీ

మహబూబాబాద్: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫైలేరియా బాధితులకు కలెక్టర్ శశాంక చేతుల మీదుగా 5రకాల ఉపకరణాలు, వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంఎండీపీ కింద వచ్చిన బకెట్, మగ్గు, టవల్, సోప్, యాంటీఫంగస్ క్రీమ్ వంటి వస్తువులు, ఉపకరణాలను పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన వస్తువులను తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామక ప్రక్రియ వాయిదా

హన్మకొండ అర్బన్: హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం జరగాల్సిన అతిథి అధ్యాపకుల నియామక ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కళాశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు విద్యా సంస్థలకు రెండ్రోజుల సెలవులు ఉండడంతో ఈనియామక ప్రక్రియను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తదుపరి తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

ఇద్దరి ప్రాణాలను కాపాడిన చెట్టు

- పాలెవర్రె ఉధృతికి కొట్టుకుపోయిన ద్విచక్రవాహనం

బయ్యారం: వరద ప్రవాహంలో ద్విచక్రవాహనంతో పాటు కొట్టుకుపోతున్న ఇద్దరు యువకులు చెట్టును పట్టుకొని తమ ప్రాణాలను కాపాడుకున్న ఘటన బుధవారం రాత్రి మండలంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. భూక్య రాజశేఖర్, భూక్య శేఖర్ బయ్యారం నుంచి ఇర్సులాపురం గ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో కట్టుగూడెం–ఇర్సులాపురం మధ్య రహదారిపై పాలెవర్రె ఉధృతంగా ప్రవహిస్తుంది. వాగు నీటి ప్రవాహాన్ని దాటే ప్రయత్నం చేస్తుండగా బైక్‌తో పాటు ఇద్దరు యువకులు కొంతదూరం కొట్టుకుపోయి చెట్టును పట్టుకొని కేకలు వేశారు. ఇది విన్న కట్టుగూడెం, ఇర్సులాపురం గ్రామానికి చెందిన పలువురు అక్కడికి వెళ్లి చెట్టుపై ఉన్న ఇద్దరిని తాడు సాయంతో వర్రెను దాటించారు. దీంతో యువకులు ప్రాణాలతో బయటపడ్డారు.



ప్రాణాలతో బయటపడ్డ యువకులు

యువకుడి ఆత్మహత్య


అనిల్‌ (ఫైల్‌)

నర్సంపేట రూరల్‌ : పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు నర్సంపేట టౌన్‌సీఐ పులి రమేష్‌గౌడ్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామ శివారులోని అమృతండాకు చెందిన భూక్యా రాజేందర్‌–భద్రమ్మ దంపతుల కుమారుడు భూక్యా అనిల్‌ (18) నర్సంపేట పట్టణంలో ఓ కళాశాలలో ఇంటర్మీడియట్‌ చదువుతున్నాడు. కళాశాలకు సక్రమంగా వెళ్లడంలేదని, చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో క్షణికావేశానికి లోనై బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనిల్‌ గతంలో కూడా రెండుమార్లు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చెన్నారావుపేట: మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన నీరటి రమేష్‌(47) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. రమేష్‌ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 15 సంవత్సరాల క్రితం నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లికి చెందిన సునీతతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు ఉన్నాడు. రమేష్‌ మద్యానికి బానిసై భార్య, కుమారుడిని పట్టించుకోకపోవడంతో భార్య సునీత పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో రమేష్‌ అధికంగా మద్యం సేవిస్తుండంతో తండ్రి ఐలయ్య మంగళవారం మందలించాడు. మనస్తాపానికి గురైన రమేష్‌ ఇంట్లో పురుగుల మందు తాగాడు. చుట్టు పక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. రమేష్‌ తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేయూకు నేడు సెలవు

- అన్ని పరీక్షలు వాయిదా



కేయూ క్యాంపస్‌: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌తోపాటు, వర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్‌, ఖమ్మం, ఆదిలాబాద్‌ జిల్లాలోని వర్సిటీ అనుబంధ కళాశాలలకు కూడా ఈనెల 27వ తేదీని సెలవుగా ప్రకటించారు. అలాగే, యూనివర్సిటీ పరిధిలో ఈ ఈ నెల 26, 27వ తేదీల్లో జరిగే వివిధ పరీక్షలను కూడా వాయిదా వేశారు.

వాయిదా పడిన పరీక్షలు ఇవే..

కేయూ పరిధిలో ఈ నెల 26న జరగాల్సిన (బుధవారం) బీఫార్మసీ 8వ సెమిస్టర్‌ పరీక్షలు, బీటెక్‌ (నాన్‌సీబీసీఎస్‌) మొదటి సంవత్సరం, నాలుగో సంవత్సరం మొదటి సెమిస్టర్‌ పరీక్షలు, ఈనెల 27న జరగాల్సిన బీఫార్మసీ 8వ సెమిస్టర్‌ పరీక్షలు, బీటెక్‌ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్‌ పరీక్షలు వాయిదా వేశామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించే తేదీలను తరువాత ప్రకటిస్తామని వారు పేర్కొన్నారు.

గుండె'జల్లు'..

ఎల్కతుర్తిలో నీటమునిగిన వరిపంట



కాజీపేట రూరల్‌:గుంతలు పడిన ఫాతిమా,దర్గా రోడ్డు



ఎల్కతుర్తిలో పత్తిపంటలో నిలిచిన వర్షపు నీరు



దంచికొడుతున్న వానలు..

- నీటమునిగిన పంటపొలాలు
- కూలిన ఇళ్లు..తెగిపోయిన రోడ్లు

ఆకాశానికి చిల్లు పండిదా అనేలా కురుస్తున్న వర్షాలకు గుండె'జల్లు'మంటోంది. ఉమ్మడి జిల్లాలో కొద్ది రోజులుగా కురుస్తున్న వానలకు కనుచూపు మేర నీరే కనిపిస్తోంది. చెరువులు మత్తళ్ల పరవళ్లు దూకుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పంటపొలాలు నీటమునిగి అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అలాగే, ఇళ్లు కూలిపోయి బాధితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వరద ప్రవాహానికి రహదారులు తెగిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మొత్తంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారుతోంది.

– సాక్షి, నెట్‌వర్క్‌


వాజేడు: నీట మునిగిన పొలాలు


వెంకటాపురం(కె): పాలెంలో కూలిన పెంకుటిల్లు


పలిమెల: కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ


చెన్నారావుపేట: బోజేర్వులో కూలిన ఇల్లు


చెన్నారావుపేట: గుంతలమయమైన రోడ్డు


ఆత్మకూరు : నీరుకుళ్లలో కూలిన ఇల్లు


సంగెం : తీగరాజుపల్లిలో కూలిన పెంకుటిల్లు


పర్వతగిరి: గండిపడిన జమాల్‌పూర్‌ రోడ్డు


స్టేషన్‌ఘన్‌పూర్‌: పాంనూర్‌లో మునిగిన పొలాలు



ఖిలా వరంగల్‌ : మధ్య కోటలో మునిగిన ఆకుకూర పంటలు


కాశిబుగ్గ : చింతా హరిజనవాడలో కూలిన ఇల్లు

ఆదివాసీ ఆణిముత్యం..

స్కాలర్‌ షిప్‌తో చదువుకుని.. అమెరికాలో ప్రొఫెసర్‌ స్థాయికి

- మారుమూల ఏజెన్సీ ఆదివాసీ యువకుడి ఘనత
- ఈనెల 28న అమెరికా వెళ్లనున్న ఈక ప్రభాకర్‌
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు


ల్యాప్‌టాప్‌లో తన ఎంపికను చూస్తున్న ఈక ప్రభాకర్‌

కొత్తగూడ : కడు పేదరికం.. తినడానికి అన్నం కూడా దొరకని పరిస్థితి. తండ్రి పని చేస్తేనే పూటగడిచేది. లేనిపక్షంలో పస్తులుండడమే. పైగా మారుమూల గ్రామం.. అందులో పాఠశాల కూడా లేని కుగ్రామం. ఇలాంటి తరుణంలో ఎవరికైనా చదువుకోవాలనే ఆలోచనే రాదు. ఏదైనా పని చేసుకుని బతకాలని భావిస్తారు. కానీ అలాంటి వారికి ఈ యువకుడు పూర్తిగా విరుద్ధం. చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించాడు. ఒక పక్క సమస్యలతో సహవాసం చేస్తూనే.. మరో పక్క అనుకున్న లక్ష్యాన్ని చేరుకుని పలువురికి ఆదర్శంగా నిలిచాడు. ఆయననే మహబూబాబాద్‌ జిల్లా కొత్తగూడ మండలం మారుమూల ఏజెన్సీ ఆదివాసీ గ్రామం దొరవారివేంపల్లికి చెందిన ఈక ప్రభాకర్‌. తాను ఎంచుకున్న విద్యలో ఖండాంతరాలు దాటి అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్‌ అయోవాలో ప్రొఫెసర్‌గా పని చేసేందుకు ఎంపికయ్యారు. ఎర్ర బస్సు కూడా ఎరగని ఈ గ్రామం నుంచి అమెరికాకు వెళ్లడంపై గ్రామస్తుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈక పాపమ్మ–సమ్మయ్య దంపతుల ప్రథమ సంతానం ప్రభాకర్‌. తన ఎదుగుదల గురించి ఆయన మాటల్లోనే..

'పోడు వ్యవసాయం ఆధారంగానే మా కుటుంబ పోషణ గడిచేది. తినడానికే ఇబ్బంది పడే పరిస్థితి. గ్రామంలో పాఠశాల కూడా లేదు. 1989లో అప్పటి ఐటీడీఏ పీఓ బెస్ట్‌ అవైలెబుల్‌ పాఠశాలలకు విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు. హాస్టల్‌కు వెళ్తే కనీసం అన్నం అయినా సరిగా దొరుకుతుందనుకునే పరిస్థితి ఉండేది. ఈ పరిస్థితిలోనే రాజేంద్ర కాన్వెంట్‌ హై స్కూల్‌లో సీటు వచ్చింది. పాఠశాల చదువులోనే మా తల్లి పాపమ్మ 1997లో మృతి చెందింది. ఈ ఘటనను దిగమింగుకుని పదో తరగతి పూర్తి చేశా. అనంతరం ఇంటర్‌ ఎల్‌బీ కళాశాల వరంగల్‌లో, కర్నూలు సిల్వర్‌ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో బీజెడ్‌సీ గ్రూపులో డిగ్రీ పూర్తి చేశా. వారణాసిలోని బనారస్‌ హిందూ యూనివర్సిటీలో బయో టెక్నాలజీలో పీజీ పూర్తి చేశా. బెస్ట్‌ అవైలెబుల్‌ స్కీం పూర్తయిన తరువాత ఐటీడీఏ నుంచి స్కాలర్‌ షిప్‌కు ఎంపికయ్యా. ఆ స్కాలర్‌ షిప్‌తోనే డిగ్రీ, పీజీ పూర్తయింది. 2006 నుంచి 2013 వరకు హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో పీహెచ్‌డి పూర్తి చేశా. 2013 నుంచి 2017 వరకు సీఎస్‌ఐఆర్‌ఏలో రీసెర్చ్‌ అసోసియేట్‌గా పని చేశా. ఇదే సమయంలో మండలంలోని ఈశ్వరగూడెం గ్రామానికి చెందిన రవళితో వివాహమైంది. పీహెచ్‌డీ ఫెలోషిప్‌లో భాగంగా 'టాటా ఇన్‌స్టిట్యూట్‌ ఫండమెంటల్‌ రిసెర్చ్‌'లో సంవత్సరం పని చేశా. అనంతరం గీతం యూనివర్సిటీలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా చేరాను. అక్కడ ప్రొఫెసర్‌గా పని చేస్తూనే గత సంవత్సరం అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్‌ అయోనాలో ప్రొఫెసర్‌గా అప్లికేషన్‌ చేశాను. నాలుగు దఫాలుగా జరిగిన ఇంటర్వ్యూల ఆధారంగా నన్ను ఎంపిక చేసి వీసా ఇచ్చారు. ఈనెల 28న అమెరికాకు వెళ్తున్నా. ఖండాతరాలు దాటి ప్రొఫెసర్‌గా పనిచేసే అవకాశం వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది'.

ఆదివాసీలకే ఆదర్శం..



చిన్న కారణాలతో విద్యను మధ్యలో వదిలేసి వెనుకబడిపోతున్న ఆదివాసీ యువతకు ప్రభాకర్‌ ఆదర్శంగా నిలిచారు. సరైన రోడ్డు కూడా లేని తమ గ్రామం నుంచి అమెరికా వెళ్లడం తమకు ఎంతో గర్వంగా ఉందని దొరవారివేంపల్లి గ్రామస్తులు పేర్కొంటున్నారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

- టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ సీఎండీ గోపాల్‌ రావు


టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ సీఎండీ గోపాల్‌ రావు

హన్మకొండ: వర్షాకాలంలో విద్యుత్‌ ప్రమాదాలకు ఆస్కారమెక్కువగా ఉంటుందని టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ అన్నమనేని గోపాల్‌రావు తెలిపారు. రాష్ట్రంలో రాబోయే మూడు రోజులపాటు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ఈ క్రమంలో విద్యుత్‌ వినియోగదారులు, రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని బుధవారం ఆయన ఒక ప్రకటనలో సూచించారు. ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని తెలిపారు. విద్యుత్‌ స్తంభాలు, స్టే వైర్లు తాకొద్దని సూచించారు. దుస్తులు ఆరేసే దండేలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. సర్వీస్‌ వైర్లు అతుకులు లేకుండా చూసుకోవాలన్నారు. రైతులు విద్యుత్‌ మోటార్లు, స్టాటర్ల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లొద్దని, సమస్యలుంటే విద్యుత్‌ అధికారులు, ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ పరిధిలోని 16 సర్కిళ్ల పరిధిలో విద్యుత్‌ పర్యవేక్షణ చేయడానికి కార్పొరేట్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌ రూం నిరంతరాయంగా పని చేస్తుందని తెలిపారు. సమస్యలు, ఫిర్యాదులను 9440811244, 9440811245 నంబర్‌లకు ఫోన్‌ చేసి తెలపాలని కోరారు. అదే విధంగా టోల్‌ ఫ్రీ నంబర్‌ 1800 425 0028కు లేదా 1912కు ఫోన్‌ చేసి తెలపొచ్చన్నారు.

చుట్ట అంటుకుని..

- వృద్ధురాలి సజీవదహనం
- దేవరుప్పులలో ఘటన
- పోలీసులకు మృతురాలి కూతురి ఫిర్యాదు


ముత్తమ్మ (ఫైల్‌)

దేవరుప్పుల : ఓ వృద్ధురాలు దైనందిన అలవాటు ప్రకారం చుట్ట తాగి ఆర్పకుండా మంచంలో పెట్టి నిద్రించింది. తెల్లారే సరికి సజీవ దహనమైంది. ఈ విషాదకర ఘటన బుధవారం మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రం కొత్తవాడలోని ఎస్సీ కాలనీకి చెందిన మాచర్ల ముత్తమ్మ (90)కు నలుగురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. భర్త 25 ఏళ్ల క్రితమే మృతి చెందగా, కొడుకు వెంకన్న బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలోనే వృద్ధాప్యానికి తోడు కొన్నేళ్లుగా పక్షవాత రావడంతో మంచానికే పరిమితమైంది. పెద్ద కూతురు ఎల్లమ్మ ఇదే కాలనీలో స్థిరపడడంతో ఆమె పర్యవేక్షణలో పక్క గదిలోనే ఉంచి సపర్యలు చేస్తున్నారు. రోజువారీగా మంగళవారం రాత్రి ఆమెకు భోజనం పెట్టి వెళ్లింది. భోజనం చేసిన అనంతరం అలవాటు ప్రకారం ముత్తమ్మ చుట్ట తాగి పూర్తిగా ఆర్పకుండా మంచంపైనే పెట్టింది. సరిగా నిప్పు ఆరని చుట్ట.. అంటుకోవడంతో పడకబట్టలతోపాటు వృద్ధురాలు సజీవ దహనమైంది. రాత్రి వర్షం పడడంతో పరిసరాలకు పొగ, మంటలు వ్యాప్తి చెందలేదు. బుధవారం ఉదయం రోజువారీగా తల్లికి సపర్యలు చేసేందుకు కూతురు ఎల్లమ్మ వెళ్లి చూసి సరికి కాలిపోయి విగత జీవిగా కనిపించింది. ఈ ఘటనపై మృతురాలి కూతురు ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

స్వరాష్ట్రంలో బ్రాహ్మణులకు ప్రత్యేక స్థానం

- రూ.232 కోట్ల నిధులతో సంక్షేమం
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి దయాకర్‌రావు

జనగామ: తెలంగాణ రాష్ట్రంలో బ్రాహ్మణ పరిషత్‌ స్థాపనతో బ్రాహ్మణ కులస్తులకు సముచిత స్థానం లభించిందని రాష్ట్ర పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సూర్యాపేట రోడ్డు ఎస్‌ఎస్‌ఎస్‌ గార్డెన్‌లో బుధవారం జరిగిన ఉమ్మడి వరంగల్‌ జిల్లా ధూప దీప నైవేద్య సంఘం అర్చకుల ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, జెడ్పీ చైర్మన్‌ పాగాల సంపత్‌ రెడ్డితో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బ్రాహ్మణ సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఏటా బడ్జెట్‌లో బ్రాహ్మణ సంక్షేమానికి కేసీఆర్‌ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటి వివిధ పథకాల అమలుకు రూ.232 కోట్లు కేటాయించిందన్నారు. నాడు 18 వందల ఆలయాల్లో పని చేస్తున్న అర్చకులకు కేవలం రూ.2 వేల 500 వేతనం ఇవ్వగా.. కేసీఆర్‌ అధికారంలోకి వచ్చిన తర్వాత 6 వేల 541 ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు రూ.10వేల వేతనం ఇస్తున్నారన్నారు. తెలంగాణలో బ్రాహ్మణ కులస్తుల జనాభా 3 నుంచి 4 శాతం ఉన్నప్పటికీ 10 శాతం రిజర్వేషన్‌ వర్తింపజేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్‌ దేశంలో ఎక్కడా లేనివిధంగా హైదరాబాద్‌లో 10 ఎకరాల స్థలంలో బ్రాహ్మణ సదనం నిర్మించినట్లు తెలిపారు. దేవుడి భూములు కూడా కబ్జాలకు గురికాకుండా కాపాడుతున్నామన్నారు. దేవాలయాల నిర్వహణకు ఏడాదికి రూ.10 లక్షలు అందజేస్తున్నామన్నారు. స్పెషల్‌ డెవలప్‌ ఫండ్‌ ద్వారా రాష్ట్రంలోని 14 దేవాలయాల్లో వివిధ పనులు చేపట్టేందుకు రూ.107 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. బ్రహ్మణ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న కేసీఆర్‌ను మూడోసారి భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమం సంఘం జిల్లా అధ్యక్షుడు త్రిపురారి మనోహర్‌ శర్మ, రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ పిందిపోలు నాగ దక్షిణామూర్తి, ప్రధాన కార్యదర్శి అన్నావజ్జుల ప్రసాద్‌ శర్మ, కోశాధికారి నందనం హరికిషన్‌, కన్వీనర్‌ గోపి కృష్ణమాచార్యులు, కృష్ణమాచార్య సిద్ధాంతి, పాగాల మఠం సాయి శివప్రసాద్‌, చండీశ్వర్‌, ఎల్లంబట్ల కరుణాకర్‌, త్రిపురారి ప్రభుదత్తు, పరమేశ్వర్‌, తదితరులు పాల్గొన్నారు.

జనశక్తి మాజీ నేత మృతి


శ్యాం(ఫైల్‌)

గీసుకొండ: వరంగల్‌ జిల్లా గీసుకొండ మండలం శాయంపేటహవేలిలో జనశక్తి మాజీ నేత పంజాల శ్యాం (58) అలియాస్‌ కిరణ్‌ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. అతని భార్య శారద ఉద్యమ సహచరిగా ఉంటూ కిడ్నీలు ఫెయిల్‌ అయ్యి గతంలోనే చనిపోయింది. శ్యామ్‌కు పక్షవాతం రాగా ఇంటివద్దే ఉంటున్నాడు. ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గతంలో ఆయన జనశక్తి పాలకుర్తి ఏరియా దళ డిప్యూటీ కమాండర్‌గా పని చేశారని గ్రామస్తులు తెలిపారు. ఆయనకు కూతురు ఉంది. 1991 నవంబర్‌ 26న శాయంపేటహవేలి సర్పంచ్‌, సీపీఐ(ఎంఎల్‌) జనశక్తి (అప్పట్లో చంద్రపుల్లారెడ్డి వర్గం) పార్టీ అనుబంధ రైతు కూలీ సంఘం నాయకుడు దాడి వెంకటయ్యను ప్రత్యర్థులు వరంగల్‌ బస్టాండ్‌లో బస్సులో ఉండగా రివాల్వర్‌తో కాల్చి చంపారు. దీనికి ప్రతీకార చర్యగా గ్రామంలో టీడీపీ సానుభూతిపరుడు ఇట్టబోయిన ఇద్దయ్య అనే వ్యక్తిని పీడీఎస్‌యూ (అప్పటి చంద్రపుల్లారెడ్డి వర్గం) కార్యకర్తలు హత్య చేశారు. ఈ కేసులో శ్యాం ప్రధాన నిందితుడు. ఈ రెండు హత్యలు అప్పట్లో జిల్లాలో సంచలనం రేపాయి. కాగా శ్యాం మృతి చెందడంతో అప్పటి ఆయన సహచర మిత్రులు, గ్రామస్తులు సంతాపం తెలిపి నివాళులు అర్పించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


బొండయ్య (ఫైల్‌)

వెంకటాపురం(కె): మండలంలోని సీతారాంపురం పెద్దవాగులో గల్లంతైన బొండయ్య (61) మృతదేహం లభ్యమైంది. మంగళవారం చేపల వేటకు వెళ్లి గల్లంతైన బొండయ్య ఆచూకీ కోసం గ్రామస్తులు, ఎన్‌డీఆర్‌ఎఫ్‌ బృందాలు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం కనిపించలేదు. ఈ నేపథ్యంలో భారీ వర్షాల కారణంగా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మృతదేహం బుధవారం వాగు ఒడ్డుకు చేరుకుంది. దీంతో ఎన్‌డీఆర్‌ఎఫ్‌ బృందాలు, గ్రామస్తులు మృతదేహన్ని వాగు నుంచి బయటకు తీశారు. కాగా, ఘటనా స్థలికి వెంకటాపురం సీఐ బండారి కుమార్‌, ఎస్సై కొప్పుల తిరుపతి రావు, రెవెన్యూ అధికారులు చేరుకుని పరిస్థితి సమీక్షించారు.

రూ.10లక్షల గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్ట్‌


నిందితుల అరెస్ట్‌ చూపుతున్న ఎక్సైజ్‌ పోలీసులు

కాజీపేట: కాజీపేట పట్టణంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్‌ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి వద్ద నుంచి రూ. 10లక్షల విలువైన 43 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు స్థానిక ఎక్సైజ్‌ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ చంద్రమోహన్‌ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన లకం అర్జున్‌, షేక్‌ సోహెల్‌.. ఆంధ్రప్రదేశ్‌లో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి కాజీపేటకు చేరుకున్నారు. ఫాతిమానగర్‌ టౌన్‌ రైల్వే స్టేషన్‌ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్నారు. దీంతో ఎక్సైజ్‌ పోలీసులు వారిని ఆపి బ్యాగులు తనిఖీ చేయగా 43 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో వారిని అరెస్ట్‌ చేసినట్లు సీఐ చంద్రమోహన్‌ తెలిపారు. కాగా, గంజాయి రవాణా చేస్తున్న నిందితులను పట్టుకున్న సీఐ చంద్రమోహన్‌, ఎస్సైలు సౌమ్య, తిరుపతి, సిబ్బంది ఖలీల్‌, కోటి, వీరమల్లు, రషీద్‌, రవీందర్‌, వెంకటరమణ, ఆయూబ్‌, లాలయ్యను ఎక్సైజ్‌ డిప్యూటీ కమిషనర్‌ అంజన్‌ రావు, సూపరింటెండెంట్‌ చంద్రశేఖర్‌ అభినందించారు.

కాజీపేట జంక్షన్‌లో భారీగా గంజాయి పట్టివేత

కాజీపేట రూరల్‌: కాజీపేట జంక్షన్‌లో బుధవారం రైల్వే పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. రైలులో గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి సుమారు 68 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు గురువారం వెల్లడించనున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.